- ప్రభుత్వ ఆర్డర్లు లేక కార్మికులకు ఉపాధి కరువు
- ఉన్నతాధికారులు చొరవ చూపాలని వినతి



వాంకిడిలోని సీఎఫ్‌సీ

పనులు లేక మూతపడిన సీఎఫ్‌సీ

ఆసిఫాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) మూడు నెలలుగా ప్రభుత్వ ఆర్డర్లు లేక మూతపడింది. దీంతో పనులు జరుగక కార్మికులకు ఉపాధి కరువైంది. గతంలో 60 మందికి పైగా కార్మికులకు ఉపాధినందించిన ఈ పరిశ్రమ నేడు పనులు లేక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. గతంలో పరిశ్రమ మూత పడి ఉండగా అప్పటి ఐటీడీఏ పీఓగా పనిచేసిన వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చాహత్‌బాజ్‌పాయ్ సీఎఫ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 3 లక్షల విలువ చేసే కలప తయారీకి ఆర్డర్ ఇవ్వడంతో పరిశ్రమ తిరిగి తెరుచుకుంది. అనంతరం బెంగుళూరుకు చెరందిన బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) కంపెనీ నుంచి రూ. 34 లక్షల విలువ చేసే 500 డ్యూయల్ డెస్క్‌లు ఆర్డర్ రావడంతో తిరిగి పరిశ్రమలో పనులు కొనసాగాయి. ఆతరువాత ప్రభుత్వ ఆర్డర్‌లు రాక కార్మికులకు పనులు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

1971లో ప్రారంభం..


రాష్ట్రంలో 1971లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో 56 సీఎఫ్‌సీ (కామన్ ఫెలిలిటీ సెంటర్) కేంద్రాలను ప్రారంభించారు. అందులో భాగంగానే అప్పటి తాలుకా కేంద్రమైన వాంకిడిలో 9 వేల రూపాయలతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని కేంద్రాలు మూతపడగా ఆదరణ పొందిన ఈ సంస్థ మాత్రమే ఉనికిని చాటుకుని నడుస్తూ వచ్చింది. కలపతో అందమైన వస్తువులు తయారు చేయడంలో ఇక్కడి కార్మికుల ప్రతిభ అమోఘం. 1980లో ఈ సంస్థను ఐటీడీ ఏ ఆధీనంలో తీసుకుని నిరుద్యోగ గిరిజన యువతకు కర్రతో ఫర్నిచర్ తయారీలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. యువతకు శిక్షణతోపాటు ఉపాధి అవకాశం కల్పించాన్న ఉద్దేశంతో 1987-88లో ఐటీ డీఏ ఆధ్వర్యంలో కార్మికుల సౌకర్యార్థం షెడ్లు, భవనాలు నిర్మించి ఫర్నిచర్ తయారీకి అవసరమైన పరికరాలను సమకూర్చి ఆధునీకరించారు. 1991 నాటికి 335 మందికి వృత్తి శిక్షణ ఇచ్చారు.

కలప కొరత ఏర్పడడంతో..

కాలక్రమేణా కలప కొరత ఏర్పడడంతో 1998-99లో మెటల్ వర్క్స్‌తో తయారు చేయడం ప్రారంభించారు. సీఎఫ్‌సీ పనితనాన్ని గుర్తించిన అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ సుకుమార్ ఈ సంస్థ అభివృద్ధికి 14 లక్షల రూపాయలను మంజూరు చేశారు. అనతంరం కొంత మంది అప్పటి ఐటీడీఏ అధికారులు ఆర్థిక సహాయం అందిచడంతో ఆధునిక యంత్రాలను సమకూర్చారు. 2012లో పనులు లేక ఈ పరిశ్రమ సంక్షభంలో చిక్కుకుంది. అప్పటి నుంచి జూలై 2015 వరకు పరిశ్రమ మూతపడింది. అనంత రం అప్పటి ఐటీడీఏ పీవో ఆర్‌వీ కర్ణన్ సీఎఫ్‌సీని సందర్శించి పరిశ్రమను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఆరు లక్షల రూపాయల కార్పస్ నిధులను మంజూరు చేసి తిరిగి సీఎఫ్‌సీని పునఃప్రారంభించారు. తరువాత ప్రభుత్వ అర్డర్లు లేకపోవడంతో తిరిగి పరిశ్రమ మూతపడింది. మూడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ 4.5 లక్షల రూపాయల విలువ గల బెంచీలు తయారు చేసేందుకు ఆర్డర్ ఇవ్వడంతో కొన్ని నెలల పాటు పరిశ్రమ కొనసాగింది. తరువాత ఆర్డర్లు లేక తిరిగి మళ్లీ మూతపడింది. ఆ తరువాత ఐటీడీఏ పీవోగా పనిచేసిన వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చాహత్‌బాజ్‌పాయ్ మూడు లక్షల రూపాయలు విలువ చేసే కలప తయారికి ఆర్డర్ ఇవ్వడంతో పరిశ్రమ తిరిగి తెరుచుకుంది. . ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవ డంతో మూడు నెలల నుంచి కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉపాధి కరువైంది..

- మడావి పైకాజీ, సీఎఫ్‌సీ ఇన్‌చార్జి



సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో ఉపాధి కరువైంది. గతంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఫర్నిచర్ ఆర్డర్లు వచ్చేవి. దీంతో 60 మంది కార్మికులకు ఉపాధి ఉండేది. గతేడాది వరకు అధికారులు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వడంతో పనులు సాగాయి. ప్రస్తుతం ఆర్డర్లు లేక పోవడంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు లభించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

ప్రభుత్వ ఆర్డర్లతోనే మనుగడ..

- రాము, కార్మికుడు



పరిశ్రమ ప్రధానంగా ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడి మనుగడ కొనసాగిస్తోంది. ఆర్డర్లు ఉన్న సమయాల్లో కార్మికులకు ఉపాధి ఉంటుంది. పనులు లేని సమయంలో కార్మికులకు కుటుంబ పోషణ సైతం భారంగా మారింది. ఈ పరిశ్రమపై ఆధారపడి ఉన్న మాకు ప్రస్తుతం పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ ఆర్డర్లు అందించి కార్మికులను ఆదుకోవాలి.

దేశ పురోగతి కోసం కలిసి నడుద్దాం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ పురోగతి కోసం మహనీయుల ఆశయాల స్ఫూర్తిగా కలిసి నడుద్దామని ఆదిలాబాద్ ఎంపీ గొడెం నగేష్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కేంద్ర యువజన క్రీడ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేరా భారత్ ఐక్యత మార్చ్ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా అధికారులు, ఉవజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి కుమరం భీం చౌరస్తా మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సర్దార్‌వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దేశ పురోగతి కోసం అందరం కలిసి నడుద్దామని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశం కోసం, దేశ ఐక్యత కోసం కృషి చేశారని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో తన వంతు పాత్ర పోషించారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్‌బాబు, కలెక్టర్ వెంకటేష్ దోత్రేలు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రమాదేవి, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి గురు లహుజీ సాల్వే ఆశయ సాధనకు పాటుపడాలి

జైనూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన క్రాంతి గురు లహుజీ సాల్వే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని గణేశ్‌నగర్ కాలనీలో శుక్రవారం క్రాంతి గురు లహుజీ సాల్వే జయంతి వేడుకలు మాంగ్ సమాజం జిల్లా అధ్యక్షుడు మోహలె దత్త అధ్యతన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, నాయకులు అంబారావ్, ధైలత్‌రావ్, గురుడకర్ కేశవ్, ఫుల్లారె విజయ్ కుమార్, మోహలె భారత్, డాక్టర్ రామారావ్, కాంబ్లే బాలాజీ, గజ్జల కాం తారావ్, దుదానె కరణ్, కోటంబే శ్రీహరి, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు కాంబ్లే బాబా సాహేబ్, కాంబ్లే అన్నారావ్, న్యాయవాది దత్త్రాత్రి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కసూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్ ఉమన్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల విద్యాధికారి యం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ వాచ్‌ఉమన్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణత ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 18వ తేదీలోగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అయ్యప్ప మాల స్వీకరించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి భర్త సోనేరావులు శుక్రవారం అయ్యప్పమాల దీక్ష చేపట్టారు. స్థానిక పెద్దవాగు అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి సూర్యభాస్కరశర్మ ఆధ్వర్యంలో అలయ అర్చకుడు నగేశ్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మితో పాటు ఆమె భర్త సోనేరావుకు మాలధారణ చేశారు.

ఘనంగా రాంజీ మలోజీ సక్పాల్ జయంతి

వాంకిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తండ్రి రాంజీ మలోజీ సక్పాల్ జయంతిని మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, దుర్గాజీ, సందీప్, విజయ్, రోషన్, శ్యాంరావు, రమేష్, మనోజ్, విఠల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్‌లో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు అక్షయ, స్వర్ణ, కీర్తన, సంధ్యారాణి, హర్షిక, శ్రీదేవి, జయశ్రీ, వైభవి, శృతిక్ష ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూకు కాంగ్రెస్ నాయకుల నివాళి

వాంకిడి/దహెగాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరిచుకుని శుక్రవారం వాంకిడి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, నారాయణ, అనిల్, గణేశ్, విలాస్, శంకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. దహెగాం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ బాలల దినోత్సవాన్ని నెహ్రూ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

ఎంపీవోగా బాధ్యతల స్వీకరణ

కెరమెరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా సాయిరాంగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.కార్యక్రమంలో కార్యదర్శులు మురళీధర్, ఈశ్వర్, గణేష్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భవిత కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈఓ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం భవిత కేంద్రాలలో వసతుల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మధుకర్, అబిద్‌అలీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుగదల, ప్రవర్తనపై తలిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి పాల్గొన్నారు.

మహిళల కుంకుమార్చన పూజలు

కౌటాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై గల ఆలయంలో ఆదివారం నిర్వహించే జాతర మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మహిళలు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

కాగజ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని బోరిగాంలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదల కోసం ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కిటికిలు, తలుపులు, అంతర్గత రహదారులు, తాగునీరు మురుగు కాల్వల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. ఇళ్ల మధ్యలో ఉన్న మధ్యలో ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, గృహ నిర్మాణ శాఖ డీఈఈ వేణుగోపాల్, రోడ్లు, భవనాల శాఖ, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్ మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఎఫ్‌వో సుశాంత్, బొబాడేలతో కలిసి నర్సరీ లో మొక్కల పెంపకం, ఉపాధి హామీ కూలీలకు పనుల కల్పన, ఇందిరమ్మ ఇళ్ల పనుల వేగవంతం అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, ఎంఈవో, ఉపాధి హామీ ఏపీవోలు, అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పెంచికలపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని బొంబాయిగూడ, చెడ్వాయి గ్రామాల్లో సుమారు రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పల్లెల రూపు రేఖలు మారుతున్నాయని అన్నారు. పంచాయతీ కార్యాలయం అందుబాటులోకి వస్తే సమస్యలు తీరుతాయన్నారు. అనంతరం గ్రామానికి చెందిన సత్తయ్య మృతి చెందడంతో మృతుడి ఇద్దరు కుమార్తెలకు ఇచ్చిన మాట ప్రకారం చెరో రూ.25 వేల బాండ్‌లకు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, నాయకులు శ్రీనివాస్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



కాగజ్‌నగర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాగజ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీనకుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో కాగజ్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆదరించారిన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్, శంకర్ యాదవ్, అరుణ్‌కుమార్, శ్రీకాంత్, శైలేష్, కిష్టయ్య, రాకేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గెలుపొందడంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునీర్, లక్ష్మణ్‌రావు, జగదీశ్వర్‌రావు, కుసుమ్‌రావ్, లింబారావు, శంకర్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జెనూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, సిర్పూర్(యు) మాజీ వైస్ ఎంపీపీ ప్రకాష్, నాయకులు మేస్రాం అంబాజీరావ్, పెందుర్ ప్రకాష్, కోట్నాక ధైలత్‌రావ్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు పంద్ర షేకు, లింగు, కృష్ణ అమృత్, భుజంగ్‌రావ్, సయద్ వసీం, హైదర్, హైమద్, దేవరావ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, శంకర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి),, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సోహెల్ అహ్మద్, తులసీరాం, అబ్దుల్ అఖిల్, మోహిజ్ అలీ, రాజు, కిశోర్, దౌలత్ రావు, సలీం తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కులు అందజేత



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశంలో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను ఎమ్మెల్యే హరీష్‌బాబు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం వివిధ పథకాల కింద మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మధూకర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల, (అంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని శ్రీవైష్ణవి జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు.. కార్యక్రమంలో సీపీవో వెంకట్‌రెడ్డి, డీఎంవో అష్రఫ్, ఏవో ప్రేమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, రాజేందర్‌గౌడ్, మల్లయ్య, మోతిరాం, ప్రవీణ్, తిరుపతిగౌడ్, మధుకర్, భూమయ్య మహేష్, శ్రీను, మోరేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ మండలంలోని తుంపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీవో మహేష్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరహరి, కార్యదర్శి దేవిక, బాల రక్ష భవన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, చంద్రశేఖర్, జమున, బాల ప్రవీణ్‌కుమార్, ఝాన్సీరాణి, పితాంబర్, వెంకటేశ్వర్లు నవీన్‌కుమార్, తిరుపతి, షూర్ ఎన్జీవో కో ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, ప్రభు, ఉపాధ్యాయులు శంకర్ తదితరులు పాల్గొన్నా రు. జిల్లా కేంద్రంలోని వట్టివాగు దిశ మోడల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు అలాగే సెయింట్ మేరీ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంఎం ఆర్ సీపీసీఎంవో ఉద్ధవ్, ఎస్‌సీఆర్పీలు రవీందర్, అనంత్, మాదవ్‌రావ్, తుకారాం, సురష్, శ్యామల, సిస్టర్ లిబిన్, కరస్పాడెంట్ లిల్లీ పాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

రెబ్బెన, (అంధజ్యోతి): బాల్యం ఎంతో అపురూపమైనదని ఉజ్వల భవిష్యత్ నిర్మాణానికి పునాది వంటిదని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు నరేందర్, రాజమల్లు, కృష్ణమూర్తి, ఉజ్వల్‌కుమార్ బెహెరా, మదీనా భాషా, జ్ఞానేశ్వర్, రవికుమార్, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా పాఠశాలల్లో బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మహగాం ఆశ్రమ పాఠశాలతో పాటు సిర్పూర్(యు) ఎంపీపీ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కుడ్మత సుధాకర్, ప్రధానోఉపాధ్యాయుడు ఆత్రం రాంబాయి, ఆత్రం దత్తు, అనక దేవేందర్, ఉర్వేత మోహన్ పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): ఆశ్రమోన్నత పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని పీజీ హెచ్ఎం పార్వాతీబాయి అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం బాల దినోత్సవం సందర్భంగా పోషకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేలా ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ద్రౌపది బాయి, పోషకులు పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఆటలతో సం దడి చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న డీసీపీవో మహేష్

రైతులకు అవగాహన

కెరమెరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరమెరి మండలం పెద్దసాకడ గ్రామంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డనేటర ప్రసూన రైతులకు శనగ సాగుపై అవగాహన కల్పించారు. అధికారుల సూచనలు పాటించి దిగుబడలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేష్, స్రవంతి, నాగరాజు, ఏవో యోగేందర్, ఏఈవో వెంకటేష్, రైతులు బాలాజీ, నానేశ్వర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆసిఫాబాద్ మండలం బొందగూడ, రౌటసంకెపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటిపై దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.4800 నగదు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. పేకాడుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దాడిలో ఎస్సై రాజు, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మహమ్మద్, విజయ్, రమేశ్, సంజీవ్, దేవేందర్, శేఖర్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల

● సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఉపాధ్యాయుల బోధన ● ఆదర్శంగా నిలుస్తున్న సావర్‌ఖేడ పాఠశాల



సావర్‌ఖేడ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే(ఫైల్)

కెరమెరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలనే తపన, మార్పులను ఆహ్వానిస్తూ కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పిల్లలకు అందించాలనే ఆలోచన, ఆచరణ ఆ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా నిలబెడుతోంది. సహచర ఉపాధ్యాయుల బృందం సమష్టి కృషితో నేడు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చేసింది. ఇటీవల హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన మల్టీ జోన్-1లోని పీఎంశ్రీ పాఠశాలలో కుమరం భీం జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడ ప్రాథమిక పాఠశాల ఎంపికైన నేపథ్యంలో స్ఫూర్తిదాయక కథనం..

సావర్‌ఖేడ పాఠశాలలో 2010లో కడేర్ల రంగయ్య ఉపాధ్యాయుడిగా తొలిసారి ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి పాఠశాల అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నారు. డిజిటల్ బోధన, పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థులకు విహార యాత్రలు, క్షేత్ర పర్యటనలు, సహచర ఉపాధ్యాయులతో వినూత్నంగా విద్యనందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తున్నారు. భర్తతో పాటు ఉచితంగా విద్యా బోధిస్తున్న ఆయన సతీమణి వీణ ఇటీవల ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేతుల మీదుగా ప్రత్యేక సత్కారం అందుకున్నారు.

ప్రత్యేక శిక్షణ..

నవోదయ, గురుకులాల్లో సీట్లు సాధించేందుకు సెలవుల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆయా గురుకులాల్లో మొత్తం 190 మంది విద్యార్థులు, చుక్క రామయ్య సంస్థలో 20, నవోదయలో ఒకరు, ప్రత్యేక గురుకులాల్లో (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్)లో ఐదుగురు సీట్లు సాధించారు. కాగా పాఠశాల అభివృద్ధిలో గ్రామస్థుల భాగస్వామ్యం కూడా ఉంది. ప్రొజెక్టర్, రెండు టీవలు, 120 కుర్చీలు, 35 బెంచీలు, మూడు కంప్యూటర్లు, విద్యార్థులకు ఐడీ కార్డులు, టై, బెల్టులు, బూట్లు తదితరాలు సమకూర్చారు. 'సార్' చిత్ర పరిశ్రమ బృందం ఆధ్వర్యంలో రూ.3 లక్షలు విరాళం అందజేశారు. పాఠశాలలో ప్రవేశ, పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డిజిటల్ బోధన చేస్తూ తీర్చిదిద్దుతున్నారు.



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు కడేర్ల రంగయ్య(ఫైల్)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఏసీబీ డీఎస్పీ మధు, సిబ్బంది

మంచిర్యాల క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం సబ్ రిజి స్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మధు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సాధారణ తనిఖీలలో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ప్లాట్ రిజిస్ట్రేషన్లు ఎల్ఆర్ఎస్ ప్రకారం జరుగుతున్నాయా లేదా, స్లాట్ బుకింగ్, చలాన్లు సక్రమంగా ఉన్నాయా లేదా, తదితర అంశాలపై తనిఖీలు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు. కొందరు దళారులపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యాలయాలతో పాటు సబ్‌రిజిస్ట్రార్ ప్రియాంక ఇంట్లో రాత్రి 10 గంటల వరకు అధికారులు సోదాలు నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య

లక్సెట్టిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌కు చెందిన చరణ్ మోతీలాల్ (36) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో లక్సెట్టిపేటలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సురేష్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం మోతీలాల్ 15ఏళ్ల క్రితం రాజస్థాన్ నుంచి ఇక్కడికి వచ్చి గణపతి విగ్రహాలను తయారు చేసుకుంటూ కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది రోజులుగా భార్యతో మనస్పర్థలు రావడంతో రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మోతీలాల్ తన ముగ్గురు పి ల్లలతో ఇక్కడే ఉంటున్నాడు. కాపురానికి రమ్మని పిలిచినా రాకపోవడంతో ఈనెల 13న సాయంత్రం ఇంట్లో ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు చరణ్ బికారాం ఫిర్యాదు మేరకు ఏఎస్సై సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

గంజాయి కేసులో ముగ్గురికి ఏడేళ్లు జైలు శిక్ష

జగిత్యాల టౌన్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుతో పాటు గంజా యిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ విక్రయాలు చేస్తున్న ముగ్గురు నిందితులకు ఏడు సంవత్సరాల జైల్ శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. గతేడాది జగిత్యాల పట్టణ పోలీసులు కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఓ షాపింగ్ మాల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మేకల రాజు అలియాస్ కిన్నరి, జగిత్యాల పట్టణానికి చెందిన ఆరుముళ్ల సాయికుమార్, ఆసిఫాబాద్‌కు చెందిన మడవి చందు అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వీరు గోదావరి నది అవతల ఉన్న ఊట్నూర్ ప్రాంతంలో మడవి చందు అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు 250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకుని జగిత్యాలలో విక్రయించేందుకు వచ్చిన క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు.. విచారణ జరిపిన న్యాయ స్థానం నేర నిరూపణ కావడంతో నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధించింది.

సైబర్ క్రైం కేసులో ముగ్గురి అరెస్టు



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్

కాగజ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట నకిలీ సైట్‌లను ఏర్పాటు, నిరుద్యోగల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన మోసం చేసినందులకు అహ్మదాబాద్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్ అన్నారు. కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన నిరుద్యోగి కిరణ్ ఆన్‌లైన్‌లో ఉద్యోగ ప్రకటనలు చూసి పూర్తి వివరాలతో దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఉద్యోగం పక్కాగా ఉంటుందని, ముందస్తుగా డబ్బులు పంపించాలని నమ్మించిన రూ.6లక్షల వసూలు చేశారని అన్నారు. తీరా ఉద్యోగం రాక పోవటంతో మోస పోయాయని ఆగస్టు నెలలో పోలీసులు ఫిర్యాదు చేశాడని అన్నారు. కిరణ్ జరిపిన బ్యాంకు లావాదేవీల ఆధారంగా అహ్మదాబాద్‌కు ప్రత్యేక టీంను పంపించినట్టు వివరించారు. కేసులో ప్రధాన నిందితులైన కడవల భవేష్ సిదాబాయ్(అహ్మదాబాద్), రాథోడ్ రాహుల్(అహ్మదాబాద్), సాహు సదీప్(అహ్మదాబాద్) అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. వీరంతా కూడా నేరం ఒప్పుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు అరెస్టు చేసినట్టు వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు. సమావేశంలో డీఎస్పీ వహిదుద్దీన్, సీఐ కిరణ్ కుమార్, టాస్క్‌ఫోర్సు సిఐ రాణా ప్రతాప్, సీఐ రవీందర్, ఎస్సై తేజస్వీని, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

లింగాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిన అరెస్టు చేసి ఒకరి రిమాండ్‌కు తరలించామని ఎస్సై గంగన్న తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళతో దురే హనుమంత్‌రావు అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆసిఫాబాద్ జైలుకు పంపించామని తెలిపారు.

హడలెత్తిస్తున్న పెద్దపులి సంచారం

● వేర్వేరు ఘటనలో రెండు లేగదూడలు మృతి ● ఆవుకు గాయాలు

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ శివారు ప్రాంతంలో పెద్దపులి సంచారం సమీప ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గురువారం ఒక్క రోజు పెద్దపులి దాడి చేయగా రెండు లేగదూడలు మృతిచెందగా మరో ఆవు తీవ్ర గాయాలపాలైందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.



పులి దాడలో మృతిచెందిన లేగదూడ

బెల్లంపల్లి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పూర్ణచందర్ తెలిపిన వివరాల ప్రకారం బుగ్గగూడెం అటవీ బీట్ పరిధిలోని 327 కంపార్టుమెంట్‌లో గురువారం ఉదయం పెద్దపులి ఆవుల మందపై దాడి చేసింది. ఈఘటనలో బుగ్గగూడెంకు చెందిన పల్లె ఎల్లక్క ఆవుకు తీవ్ర గాయాలు కాగా ఒక లేగదూడ మృతిచెందిందన్నారు. అలాగే దేవాపూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అనిత తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపూర్ అటవీ బీట్ పరిధిలోని 456 కంపార్టుమెంట్‌లో ఎగ్గండి వాగు సమీపంలో గురువారం సాయంత్రం పెద్దపులి ఆవుల మందపై దాడి చేసిందన్నారు. లక్ష్మీపూర్ కొలాంగూడకు చెందిన టేకం మారుతి లేగదూడ మృతిచెందినట్లు తెలిపారు. సంఘటన స్థలాలను అటవీ శాఖ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ మాట్లాడుతూ బెల్లంపల్లి, తిర్యాణి, దేవాపూర్ అటవీ రేంజ్‌ల పరిధిలో పెద్దపులి పర్యటిస్తుందని, కాబట్టి పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు, పత్తి రైతులు ఒంటరిగా అడవీ ప్రాంతానికి వెళ్లవద్దని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా వన్య ప్రాణులకు హానీ తలపెడితే చట్టపరంగా చర్యలుంటాయన్నారు. పులి దాడిలో నష్టపోయిన వారిని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి కలెక్టర్ హాజరై వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 58వ జాయతీ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 19 వరకు వా రం రోజుల పాటు జిల్లాలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, వక్తిత్వ పోటీ, చిత్రలేఖనం, వ్యాసరచన, ధ్యానం, వ్యక్తి త్వ అభివృద్ధి, పాటలు, రంగోలి, మెహందీ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని అన్ని హంగులతో పూర్తి పూర్తి సౌక్యాలతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అవసరమైన మెటీరియల్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, లైబ్రేరియన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ఆసుపత్రి పర్యవేక్షకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటుం దని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల సౌకర్యార్థం ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుద్ధమైన తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. ఆసుపత్రికి ప్రతి రోజు వైద్య చికిత్స కోసం ప్రజలు వస్తుంటారని, వారికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడం కోసం ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను నిలదీయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

మందమర్రిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్యసం ఘాలను కార్మికులు నిలదీయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం రామకృష్ణపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటా ్లడుతూ సింగరేణిలో ఉద్యోగులు ప్రస్తుతం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.వారి ఓట్లతో గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీలు యాజమాన్యానికి తొత్తుగామారాయన్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి సంవత్సరం 150 మస్టర్లు చేయాలని వచ్చిన సర్క్యూలర్ తమకే తెలియని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం తమయూనియన్ కృషి చేస్తుందన్నారు. తమ యూనియన్ 17వ మహాసభలకు సంబంధించి యాజమాన్యం విధానాలు, గుర్తింపు సంఘం పాత్ర గురించి కార్మికులకు తెలియజేస్తామన్నారు. ఈ నెల 30న మందమర్రిలో రాష్ట్ర మహాసభలను నిర్వహించబోతున్నామన్నారు. సభల్లో కార్మికుల సంక్షేమం కోసం పలు తీర్మానాలను చేస్తామని తెలిపారు. సమావేశంలో వెంకటస్వామి, రాజేందర్, రాజమౌళి, రామస్వామి, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో భవిష్యత్తు చక్కదిద్దుకోవాలి

శ్రీరాంపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో భవిష్యత్తు చక్కదిద్దుకోవాలని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సీసీసీలోని సింగరేణి పాఠశాలలో వేడుకలు నిర్వహించగా, జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేడుకల్లో భాగంగా ఆటల పోటీలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపిన వారికి జీఎం బహుమతులు అందించారు. విద్యార్థుల ఫ్యాన్సీడ్రెస్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ ఎం. రాకేష్, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు తప్పనిసరిగా హాజరు కావాలి

శ్రీరాంపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగం లభించడం అదృష్టమని, యువతీయువకులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 16వ తేదీన కొత్తగూడెంలో విధుల్లో చేరబోతున్న 91 మంది డిపెండెంట్లకు జీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణివ్యాప్తంగా 374 మంది డిపెండెంట్లు ఉండగా, శ్రీరాంపూర్ ఏరియాలో 91 మంది ఉండడం సంతోషదాయకమన్నారు. వీరంతా ఈ నెల 16న కొత్తగూడెంలో విధుల్లో చేరబోతున్నట్లు చెప్పారు. ఉదోగులు విరమణ పొందిన రోజే మెడికల్ కార్డులు అందజేయడం, ఉద్యోగుల ఆధార్‌కార్డులు, బ్యాంక్ ఖాతాలు అనుసంధానం చేసినందుకు పర్సనల్ విభాగం ఉద్యోగులు అభినందనీయులని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు ఎం. రాజేష్, జీకే కిరణ్, సీనియర్ పీవోలు సురేందర్, మురళి, పిట్ కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు రక్షణతో కూడి న నాణ్యమైన బొగ్గును వెలికితీయాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బొగ్గు నాణ్యతా వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ ఓసీపీలో సదస్సు నిర్వహిం చగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల్లో నాణ్యతా ప్రమా ణాలు పాటించినప్పుడే విలువ ఉంటుందన్నారు. వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా ఉద్యోగులు నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. షావల్ ఆపరేటర్లు, డంపర్ ఆపరేటర్లు నైపుణ్యంతో మట్టి, రాయి, బొగ్గు వేరుపరచాలని సూచించారు. అంతకు ముందు ఉద్యోగులతో బొగ్గు నాణ్యతా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, ఏరి యా క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్, మేనేజర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సం యుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి లచ్చన్న, సంక్షేమాధికారి ఓంకారి బాపు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

శ్రీరాంపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్య సింగరేణి సాధన సాధ్యమని జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా జీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో జీఎం మాట్లాడారు. వ్యాధులబారిన పడకుండా సంతులిత ఆహారం తీసుకుంటూ నిత్యం వ్యాయామం చేయాలన్నారు. డిప్యూటీ సీఎంవవో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బీపీ, మధుమేహం బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలి



దర్నా నిర్వహిస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర గౌరవ సలహాదారు టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బెల్లంపల్లి, రామగుండం రీజియన్లతో పాటు భూపాలపల్లికి చెందిన కాంట్రాక్ట్ కార్మికులకు గత ఆరేళ్లుగా సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వడం లేదన్నారు. సీఎంపీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ చేస్తానని యాజమాన్యం పేర్కొంటున్నా ఇంతవరకు చేయలేదన్నారు. కమిషనర్‌ను అడిగితే జీఎంల కార్యాలయాల నుంచి తమకు అందలేని చెప్తున్నారని, యాజమాన్యం స్పందించి సీఎంపీ ఎఫ్ చిట్టీలు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకన్న, నాయకులు తిరుపతిరెడ్డి, శంకర్, తిరుపతి, గొట్టె శ్రీనివాస్, రాజన్న, బాపు, అప్పారావు, బక్కన్న, శంకర్, సుధాకర్, సుగుణ, రాజేశ్వరి, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ ఔట్ సోర్సింగ్, డైలీ వేజ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బీసీడీడీ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, అన్వర్, సతీష్, లక్ష్మి, శారద, పార్వతి, సరోజ, జ్యోతి, పోశక్క, పల్లవీ, కృష్ణవేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ అలీబిన్ అహ్మద్ ఆధ్వర్యంలో అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, మేనేజర్ విదయ, సూపర్‌వైజర్ అజయ్, స్టాఫ్ మోహన్‌గౌడ్, తిరుపతి, నీరజ, సుమ, సీఈవో విలాస్, కార్యదర్శి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి పంచలోహ విగ్రహాలు బహూకరణ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నది తీరాన గల బాలేశ్వర స్వామి ఆలయానికి మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన పంచదార మహేందర్ శర్మ, లక్ష్మి ప్రసన్న దంపతులు శుక్రవారం పంచలోహంతో కూడిన పార్వతి పరమే శ్వరుల ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. దాతలను ఈ సందర్భంగా పలువురు అభినందిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్, సురేష్ మహేష్, రమ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలి

దండేపల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని గిరిజన పాఠశాల సహాయ గిరిజన సంక్షేమ అధికారి సురేష్ సూచించారు. శుక్రవారం దండేపల్లి మండలం దమ్మనపేట ప్రభుత్వ గిరిజన పాఠశాలను సందర్శించి ఆకస్మీకంగా తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి విద్య బోధనతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎస్‌సీఆర్‌పి రఘునాథం, ఉపాధ్యాయుడు హరిశ్చందర్, విద్యార్థులు ఉన్నారు.

బండరాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న స్థానికులు

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రొట్టెపల్లి అటవీ శివారు ప్రాంతం నుంచి కొంత కాలంగా బండరాళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. శుక్రవారం ట్రాక్టర్‌లో బండరాళ్లను తరలిస్తుండగా స్థానిక ఆదివాసీ గిరిజనులు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. రొట్టె పల్లి చిన్న గుట్టల నుంచి అక్రమంగా మొరం, బండరాళ్లను తరలిస్తున్నారని రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖల అధికారులకు తెలిపినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ సంపద వనరులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

17న ఎమ్మార్పీఎస్ చలో ఢిల్లీ

నస్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు చేపట్టడంలో వ్యవస్థలు చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య తెలిపారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. అక్టోబరు 6న దాడి జరిగినప్పటికి ఇప్పటి వరకు బాధ్యులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయలేదన్నారు. అనంతరం చలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు చుంచు శంకర్ వర్మ, మంతెన మల్లేష్, గొడిసెల దశరథం, చెన్నూరి శ్రీనివాస్, వెల్పుల సమ్మయ్య, కల్లెపల్లి రాజు, రాజు పాల్గొన్నారు.




అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు పంట చుట్టూ చీరలు కట్టిన రైతులు

పంటలు అడవి పందుల పాలు

పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

బెల్లంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అడవి పందులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అటవీ ప్రాంతాల నుంచి అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉండగా పత్తి సైతం చేతికి వచ్చింది. ఈ సమయంలో పందులు పంట పొలాల్లోకి వస్తూ పంటలను ధ్వంసం చేస్తుండడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రతియేటా వందల ఎకరాల్లో నష్టం...

ప్రతియేటా పంట చేతికి అందే సమయంలో పంటలపై అడవి పందులు దాడులు చేస్తూ రైతుల ను నష్టపరుస్తున్నాయి. చీకటి పడితే అడవి పందులు గుంపులుగా వచ్చి పంటలపై దాడి చేసి పంటలను తినేయడంతో పంటలను ధ్వంసం చేసి వెళ్లిపోతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని అడవి గుట్ట ప్రాంతాలకు దగ్గరగా ఉన్న పతి చేన్లలో పంట పొలాల్లో కూరగాయల పంటలకు అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. రాత్రి పందులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ప్రతి యేటా వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతోంది.

ఈ సీజన్‌లో ఇప్పటికే వందల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలు అడవి పందులు దాడి చేయడంతో దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని తాండూర్, వేమనపల్లి, కోటపల్లి, చెన్నూరు, కాసిపేట, లక్సెటిపేట, దండేపల్లితో పాటు బెల్లంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అడవి పందులు పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. పంటలు చేతికి వచ్చిన సమయంలో, సాగు చేస్తున్న సమ యంలో అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అడవి పందుల దాడిలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ. 7,500 చొప్పున నష్టపరిహారం అందిస్తున్నా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేక పోవడంతో సంబంధిత అధికారులకు దరకాస్తులు చేసుకోవడం లేదు.

అలాగే జిల్లాలో ఎక్కువగా సాగు చేసే రైతులు కౌలు రైతులు ఉంటుండంతో కౌలు రైతులకు నష్ట పరిహారం వర్తించని పరిస్థితి నెల కొంటుంది. అలాగే వివిధ కారణాలతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో నష్టపోతే నష్టపరిహారం రావడం లేదు.



రైతులకు తప్పని పాట్లు

అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. చీకటి పడితే పంట పొలాల్లోకి వచ్చే అడవి పందుల గుంపులను అడ్డుకునేందుకు పొలం గట్లపైనే కాపలా ఉంటున్నారు. కొందరు రైతులైతే ఏకంగా టపాసులు కాలుస్తూ కాపలాగా ఉంటున్నారు. మరికొందరు రైతులు పొలం గట్లపైన, తమ పంట పొలాల్లో మనుషులు ఉన్నట్లుగా బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు తమ పంట పొలాల రక్షణకు పాత చీరలను చుట్టూ కడుతున్నారు. ఇలా రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో అడవి పందులు రైతులపై దాడులు చేస్తుండడంతో ప్రతియేటా పదుల సంఖ్యలో రైతులు గాయపడుతున్నారు.

పంటలను నష్టపరుస్తున్నాయి. :సంతోష్, రైతు



పంట పొలాలపై అడవి పందులు దాడి చేసి ప్రతియేటా నష్టపరుస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నాం. అడవి పందులు గుంపులుగా వస్తుండడంతో వాటిని గమనించి టపాసులు కాలుస్తూ శబ్దాలు చేస్తూ పంటలను కాపాడుకుంటున్నాం. పంట చేతికి అందే సమయంలో పంటలను తినేసి కాళ్లతో తొక్కయడంతో పంట నాశనం అవుతుంది. అడవి పందుల కట్టడికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపి..



మంత్రి ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినందుకు గాను శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి వివేక్, ఎమ్మెల్యే వినోద్‌లకు బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికలకు ఇన్‌చార్జిగా మంత్రి వివేక్ వెంకటస్వామి విజయవంతంగా ముందుండడంతోనే అధిక మెజార్టీ సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ సూరిబాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ నాతారి స్వామి నాయకులు కారుకూరి రాంచందర్, దావ రమేశ్, విజయ్ పాల్గొన్నారు.

రైతులు కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి



వరి కోతలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

మందమర్రిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు కూరగాయల పంటలను సాగు చేస్తే మంచి లాభాలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో శుక్రవారం సురేఖ వరి కోతలను, వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి కోతలు చేపట్టే సమయంలో హార్వెస్టర్‌ఫ్యాన్ వేగం 18 నుంచి 20 ఆర్‌పీఎం ఉండేలా చూసుకోవాలన్నారు. ధాన్యంలో తేమ శాతం 14 నుంచి 17 మధ్య ఉండేలా ధాన్యంను ఆరబెట్టుకోవాలన్నారు. తాలు, తప్ప, మట్టి బెడ్డలు వంటివి రెండు శాతం మించకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. కోసిన వరిధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి అనుమతి పత్రంతో కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. అనంతరం కూరగాయలు పండిస్తున్న రైతు సతీష్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో రైతులు కమల్ మనోహర్‌రావు, గందె రాంచందర్, రాజమల్లు, మధునయ్య, రమేష్, సలీం, మల్లేష్, పంచాయతీ కార్యదర్శి నవ్య పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు

(5వ పేజీ తరువాయి)

విధుల్లో 56 మంది ఉన్నారు. మరో 11 మంది కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో 74 పోస్టులు భర్తీ కావలసి ఉంది. అసోసియేట్ ప్రొఫెసర్ విభాగంలో 51 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే విధుల్లో ఉండగా, మరో కాంట్రాక్టు ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో మరో 48 మంది నియామకం జరగాల్సి ఉంది. ప్రొఫెసర్ విభాగంలో 41 పోస్టులు మంజూరు కాగా, విధుల్లో 19 మంది ఉండగా, ఒక్కరు కాంట్రాక్టు పద్దతిలో పని చేస్తున్నారు. ఈ విభాగంలో మరో 21 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ ఆఫీసర్స్ విభాగంలో మొత్తం 354 పోస్టులు మంజూరు కాగా పూర్తి స్థాయిలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

డీఎంహెచ్‌వో పోస్టు ఖాళీ..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన డీఎంహెచ్‌వో పోస్టే ఖాళీగా ఉండటం గమనార్హం. గతంలో ఇక్కడ డీఎంహెచ్‌వోగా పని చేసిన డా. హరీష్ రాజ్ ఈ నెల ఒకటవ తేదీన బదిలీ అయ్యారు. 15 రోజులు కావస్తున్నా ఆయన స్థానంలో రెగ్యులర్ అధికారి నియామకం కాలేదు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న ఓ మెడికల్ అధికారికి డీఎంహెచ్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించి విధులు నిర్వహింపజేస్తున్నారు. దీంతో ఆసుపత్రుల పర్యవేక్షణ కొరవడంతో పాటు వైద్యులు, సిబ్బందిపై అజమాయిషీ పూర్తిస్థాయిలో ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. రెగ్యులర్ డీఎంహెచ్‌వోను త్వరితగతిన నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా వైద్యాధికారి కార్యాలయంలోనూ సిబ్బంది కొరత గణనీయంగా ఉంది. ఇక్కడ వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 58 పోస్టులు మంజూరు కాగా కేవలం 29 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మరో 29 ఖాళీలు దర్శనమిస్తున్నాయి.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

వేమనపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లిమండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆదివాసీల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు హైదరాబాద్‌లోని సీఎం ప్రజావాణి నోడల్ అధికారిణి దివ్య దేవరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నంలు వినతి పత్రాన్ని అందజేశారు. నాగారం నుంచి మంగెనపల్లి వరకు అటవి ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని, గిరిజన బాలబాలికలకు గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యమే కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల భాగస్వామ్యమే పాఠశాలల అభివృద్ధికి దోహదం చేస్తుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం స్టేషన్ పెద్దనపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పెద్దనపల్లి పాఠశాలలో 6, 7 తరగతులను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుల సంఖ్య పెరుగు తుందన్నారు. పాఠశాలకు మౌలిక సదుపా యాలను కల్పించిన స్థానికులు గుర్రం శ్రావణి - రాజేష్ దంపతులను ఆయన అభినందించారు. బాలల దినోత్సవం సంద ర్భంగా శాంతి పావురాలను ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. డీఈవో యాదయ్య, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం సాంబమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు శారద, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో ఘనంగా సంబరాలు జరిపారు. ఐబీ చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు తినిపించుకు న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూదరి తిరుపతి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజా విశ్వాసంతోనే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందారని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ అన్నారు. నవీన్ యాదవ్ విజయంపై ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కేంద్ర సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, సమ్మయ్య, గరిగె స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సవఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఏఎంపీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు సతీష్, అశోక్, లక్ష్మినారాయణ, వెంగళ్‌రావు, రాజన్న, లింగారెడ్డి పాల్గొన్నారు.

నెన్నెల : కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, చెన్నోజు శంకరయ్య, మల్లాగౌడ్, తోట శ్రీనివాస్, సంధ్య, తిరుపతి, సాంబమూర్తిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు మాణిక్యం, నందునాయక్, వికాస్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: మందమర్రిలో కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు సంబరాలు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. బాణా సంచా పేల్చారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, రమేశ్, సట్ల సంతోష్‌గౌడ్, ఆకారం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలో స్థానిక ఐబీలో నాయకులు బానా సంచా పేల్చి స్వీట్స్ పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, నాయకులు గుత్తికొడ శ్రీధర్, అమీర్, గుండ శ్రీనివాస్, చంద్రమౌళి, స్వామి ఉన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం..

నస్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్‌లోని అల్లూరి సీతారామ రాజు నగర్‌లో గల ఎస్ఆర్ఆర్ హై స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్యాన్స్, నాటక, జానపద నృత్యాల ప్రదర్శనలు నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని ఘనంగా జరిపారు. పాఠశాల కరస్పాండెంట్ పెట్టెం మల్లేష్, ప్రిన్సిపాల్ రేగళ్ల ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. చాచానెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం పాఠశాలలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేసినట్లు వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వెల్లడించారు

బెల్లంపల్లి: పట్టణంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో బాలబాలికలు సంస్కృతిక నృత్యాలతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరించారు. క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఎంఈవో పోచయ్య పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలలే దేశ భవిష్యత్‌ను మార్చే పౌరులుగా ఎదగాలని కోరారు. పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి ప్రభుత్వ ఉన్న పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావే శమయ్యారు. విద్యార్థిని, విద్యార్థులు చదువుల్లో రాణించేందుకు అవసరమయ్యే సూచనలు ఇచ్చారు. విద్యార్థి ని, విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణ ధరించి తోటి విద్యార్థులకు పాటాలను బోధించారు. ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం అశోక్ పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు తూముల నరేష్, దేగ బాపు, పెంట రజీత, నాయకులుపాల్గొన్నారు.

భీమారం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. భీమారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు టీచర్లుగా మారి తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు : పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో సంస్కృతిక పోటీలను నిర్వహించారు.

జైపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు మద్దుల సునీతరెడ్డి పాల్గొన్నారు.



జైపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

మందమర్రిరూరల్: మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చేశారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీం, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీమోడల్ స్కూల్, దేవులవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులు బోధిస్తూ స్వయం పాలన దినోత్సవం జరిపారు. ఈకార్యక్రమంలో మోడల్ స్కూల్‌ప్రిన్సిపల్ రాజశేఖర్, దేవులవాడ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్‌లోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ప్రదర్శనలో విద్యార్థులు..బెల్లంపల్లిలో వివిధ వేషధారణలో విద్యార్థులు

జ్వరంతో మహిళ మృతి

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన గిరిజన మహిళ మర్సుకోల కమలాబాయి (50) జ్వరంతో గురువారం రాత్రి ఇంట్లో మృతి చెందింది. అటవీ సమీప గ్రామాలు కావడంతే చలి తీవ్రత పెరిగి శ్వాస సంబంధిత వ్యాధులతో పాటు జ్వరాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో లక్ష్మీపూర్, వెంకటాపూర్, లక్ష్మీపూర్ కొలాంగూడ గ్రామాల్లోని ప్రజలు జ్వరాలతో అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

గూడెం ఆలయంలో సామూహిక వ్రతాలు

దండేపల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ దశమి చివరి శుక్రవారం పురస్కరించుకుని దండేపల్లి మండలం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తులతో కార్తీక సందడి నెలకొంది. ఉదయం నుంచి 10వేల మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

సీపీఐ ప్రచార జాతను విజయవంతం చేయాలి

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15 నుంచి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ నుంచి ప్రారంభమయ్యే సీపీఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల ప్రచార జాతను విజయవంతం చేయాలని సీపీఐ కాసిపేట మండల కార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. శుక్రవారం కాసిపేట గనిపై జాత పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ప్రచార జాతను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్య కర్తలు కృషి చేయాలన్నారు. ముగింపు సభలో కార్మికులు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశం, గట్టయ్య, లక్ష్మీనారాయణ, సుధాకర్, రాజు, లింగన్న, వెంకన్న, సత్తయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వానికే పట్టం కట్టారు

మంత్రి వివేక్ వెంకటస్వామి



మంత్రిని సన్మానిస్తున్న మందమర్రి నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ప్రజాప్రభుత్వ పాలనను చూసి తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు విజయం కట్టబెట్టారని రాష్ట్రకార్మిక ఉపాధిశాక గనులశాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ 25వేల మెజార్టితో విజయం సాధించడం జుబ్లీహిల్స్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మాయ మాటలు చెప్పి తమ ప్రభుత్వంతో పాటు అభ్యర్థిపై తప్పుడు ప్రచారం చేసినా జుబ్లీ ప్రజలు కర్ర కాల్చి బీఆర్ఎస్‌కు పెద్ద వాత పెట్టారన్నారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూర్తిగా విఫలమయ్యాడని కారు దుకాణం బందయ్యే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడంతో మందమర్రి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులంతా వాహనాల్లో హైద్రాబాద్‌కు తరలి వెళ్లి షేక్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. మంత్రిని కలిసిన నాయకులు ఎండీ ఇసాక్, పవన్, మహేష్ ఉన్నారు.

మధుమేహ వైద్య శిబిరం



కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాలమేరకు మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు అధికారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారా మధుమేహం, రక్తపోటులను నియంత్రివచ్చని తెలిపారు. మధుమేహ వ్యాధి శరీర భాగాలను దెబ్బతీస్తుందని, దేశంలో డయాబెటిస్ ఆందోళనకర స్థాయిలో ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 24,430 మందిలో మధుమేహాన్ని గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చికిత్స అందించామన్నారు. ఈ కార్యక్రమంలో 92 మంది అధికారులు, సిబ్బందికి మధుమేహం,రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, కలెక్టరేట్‌పరిపాలన అధికారి రాజేశ్వర్, ప్రోగ్రాం అధికారి ప్రసాద్, ఇన్‌చార్జి లింగారెడ్డి, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

దండేపల్లిలో భారత సహకార వారోత్సవాలు

దండేపల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిరంతరం కృషి చేస్తుందని నెల్కి వెంకటాపూర్ సహకార కార్యదర్శి పేరం వెంకటేష్ అన్నారు. 72వ భారత సహాకార సంఘం వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం దండేపల్లి సహాకార సంఘం ప్రధాన కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేవమే ధ్యేయంగా సహకార సంఘం కృషి చేస్తుందన్నారు. రైతులకు పంట రుణాలు. విత్తనాలు, డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు అందించడమే కాకుండా సహకర సంఘం సేవలను రైతులకు అందిస్తున్నామన్నారు. సహకార సంఘం సిబ్బంది అక్క రవి, సాయికు మార్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

దండేపల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్ర ప్రజలు ఎన్‌డీఏ కూటమిని గెలిపించడం పట్ల దండేపల్లిలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం టపాసులు కాల్చి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బందెల రవిగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ల కావాస్తున్న సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయడం లేదన్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధి లేక కుంట్ర పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గోపతి రాజయ్య, నాయకులు శ్రీనివాస్, రాకేష్, సత్తయ్య, హరీష్, శంకరయ్య, గురువయ్య, రవీందర్, చారి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

హాజీపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :హాజీపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఎన్‌హెచ్- 63 జాతీయ రహదారిపై భారీ రవాణా వాహనాలను తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ ఓవర్ లోడ్ విషయమై తనిఖీ చేసి సరైన పత్రాలు లేని, అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు ఈ- చలాన్ ద్వారా జరిమానాలు విధించారు. ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్న నాలుగు క్రషర్ టిప్పర్లను ఆధీనంలోకి తీసుకొని చర్యల నిమిత్తం మైనింగ్ డిపార్మెంట్ అధికారులకు, రవాణా శాఖకు అప్పగించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హాజీపూర్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్‌స్పెక్టర్ ఎన్ స్వరూప్‌రాజ్, ఏఎస్‌ఐ షేక్ చాంద్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

మంచిర్యాల క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాలతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపేంద్ర అన్నారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి కృత్విక్ కుమార్, పాఠకులు శ్రీరాములు, మురళి, రామరావు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు అడవి పందుల పాలు

ప్రతియేటా పంట చేతికి వచ్చిన సమయంలో దాడులు

వందల ఎకరాల్లో దెబ్బతింటున్న వైనం 7

వైద్య ఆరోగ్యశాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు



- డీఎంహెచ్‌వో సహా పలు పోస్టులు..
- పీహెచ్‌సీలలోనూ వేధిస్తున్న సిబ్బంది కొరత
- క్లస్టర్ హెల్త్ సెంటర్లదీ అదే పరిస్థితి
- ఇన్‌చార్జిలతో కాలం వెళ్లదీస్తున్న ఉన్నతాధికారులు

మంచిర్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. కీలక పోస్టుల్లో ఖాళీల కారణంగా ఇన్‌చార్జిలతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని ముఖ్య విభాగాల్లోనూ డిపార్ట్‌మెంటల్ అధిపతులు లేక పోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. జిల్లాలో ప్రభు త్వ జనరల్ హాస్పిటల్‌తోపాటు 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 03 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 01 పీపీ యూనిట్ (ఇమ్యూనైజేషన్ అండ్ ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్), 04 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 04 బస్తీ దవాఖానాలు, 01 ఆప్తాల్మిక్ యూనిట్ ఉన్నాయి. ప్రతీ పీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లతోపాటు సీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్, సీనియర్ అసిస్టెంట్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం, ఎంపీహెచ్‌ఎస్, గ్రేడ్-2 ఫార్మాసిస్ట్, గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్, ఆఫీస్ సబార్డినేట్స్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

పీహెచ్‌సీల్లో 210 ఖాళీలు...

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద మొత్తంలో ఖాళీలు ఉన్నాయి. వాటిలో ఆయా ఆ సుపత్రుల్లో మెడికల్ ఆఫీసర్లు మినహా ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలోని మొత్తం 17 పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లతో కలిపి మొత్తం 445 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం పొజిషన్‌లో 235 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 210 ఖాళీలు ఉండగా, ఉన్న సిబ్బందితోనే నెట్టుకు వస్తున్నారు. ఖాళీల విషయమై భర్తీ కోసం ప్రభుత్వానికి వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య అధికారులు అవసరమైన నివేదికలు అందజేసి నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాలోని మూడు కమ్యూ నిటీ హెల్త్ సెంటర్లకు సంబంధించి 71 పోస్టులు మం జూరు కాగా, వాటిలో ప్రస్తుతం 31 మంది విధుల్లో ఉన్నారు. ఇంకా 40 ఖాళీలు ఉన్నాయి. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు నాలుగు ఉండగా వాటిలో 73 పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 64 మంది విధులు ఉం డగా తొమ్మిది ఖాళీలు ఉన్నాయి. అలాగే మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అనుబంధంగా ఉన్న పీపీ (ఇమ్యూ నైజేషన్ అండ్ ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్) యూనిట్ కు 02 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మంజూరు కాగా, పొజిషన్‌లో ఒక్కరు కూడా లేరు. ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) రెండు పోస్టులకు గాను ఒకరు విధుల్లో ఉన్నా రు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టు ఒకటి మంజూరు కాగా, అదికూడా ఖాళీగానే ఉంది. ఇదిలా ఉండగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని ఆప్తాల్మిక్ యూనిట్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. జిల్లాలో నాలుగు బస్తీ దవాఖానాలు ఉండగా 12 పోస్టులు మంజూరయ్యాయి. ఆయా దవాఖానాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

వైద్య కళాశాలలోనూ అరకొర సిబ్బందే...

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనూ మంజూరైన పోస్టులకు సరి పడా నియామకాలు లేకపోవడంతో వాటికి అను బంధంగా పని చేస్తున్న వైద్య కళాశాల నుంచి అవసరమైన వైద్యులు, సిబ్బందిని వినియోగి స్తున్నారు. మెడికల్ కాలేజీలోనూ సరిపడా సంఖ్య లేకపోవడంతో ప్రజలకు కొంతమేర ఇబ్బందులు తప్పడం లేదు. వైద్య కళాశాలకు 141 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం..

(తరువాయి 7లో)

రేపటి భవిష్యత్తు నేటి బాలలపై ఆధారపడి ఉంది

కలెక్టర్ కుమార్ దీపక్



బాలికలకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రేపటి తెలంగాణ భవిష్యత్తు నేటి బాలలపై ఆధారపడి ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొ న్నారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 2047 రైసింగ్ తెలంగాణ విజన్‌లో పిల్లల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. పిల్లలకు రాజ్యాంగం చట్టపరమైన హక్కులను కల్పించిందని, వీటిపై బాలలు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు తమ ప్రతి హక్కును తెలుసుకోవాలని, దాడులు, వేధింపులు నిర్మూలించేందుకు సమాజం కట్టుబడి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ సకల సదుపాయలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని, మధ్యాహ్న భోజనంలో మెను ప్రకారం పౌష్టికాహారం అందిస్తుందన్నారు. కార్యక్రమానికి ముందుగా సంతకాల సేకరణ చేపట్టి బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి దుర్గా ప్రసాద్, జిల్లామైనార్టీ అధికారి రాజేశ్వరి, పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానా ఏర్పాటు చేయండి

జన్నారం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురిమడుగు గ్రామంలో పల్లెదవాఖాన ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎనగందుల బాగ్యరాజు, పోడూరి దినేష్‌లు మాట్లాడుతూ మురిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో కొమ్ము గూడెం, లంబడి తండ, సోమగూడెం, నర్సింగాపూర్, వెంగలపూర్, కొత్తగూడ, మల్లాపు రం, వెంకటాపూర్-2 గ్రామాల ప్రజలకు ప్రభుత్వవైద్యం అందాలంటే పల్లెదవాఖానా ఏర్పాటు చేయాలనికోరారు. గ్రామస్థులు గనేష్, ప్రవీణ్, ఆదర్శ్, సందీప్, మొండయ్య పాల్గొన్నారు.

సద్దుమణిగిన పోడు రగడ

లింగాపూర్ ఫారెస్ట్‌లో గిరిజనులు స్వచ్ఛందంగా తొలగించుకున్న గుడిసెలు

దండేపల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులు, అలవీశాఖాధికారుల మధ్య ఘర్షణ వాతావరణం ఇక సమసిపోయి నట్టే. మండలంలోని తాళ్లపేట అటవీరెంజ్ కార్యాలయ పరిధిలో లింగాపూర్ అటవీ బీట్ 380 కంపార్ట్‌మెంట్‌లో పోడు వ్యవసాయం కోసం ఆదివాసి గిరిజనులు వేసుకున్న తాత్కాలిక గుడిసెలను శుక్రవారం వారే స్వచ్ఛందంగా తొలగించుకోవడంతో అటవీ శాఖ అధికా రులు ఊపిరి పీల్చుకున్నారు. కొంత కాలంగా పోడు భూముల కోసం



గుడిసెలను తొలగిస్తున్న ఆదివాసీలు

వందలాది ఎకరాల అటవీ భూమిలో దమ్మనపేట, రాముగూడ, బిల్యగూడ చెందిన 85 ఆదివాసీ కుటుంబాలు లింగాపూర్ బీట్‌లో పంటలు సాగు చేశారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఆ భూమిని ఖాళీ చేయాలని కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేదు. కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు వచ్చి అవగాహన కల్పించినా వారు వినకుండా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాజాగా గురువారం గుడిసెలు తొలగించేందుకు వందలాది మంది అటవీ అధికారులు, సిబ్బంది రావడంతో మళ్లీ అక్కడ యుద్ధ వాతావరణ నెలకొంది. దీంతో అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గిరిజనులను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. వారితో కలెక్టర్ చర్చలు జరిపి అదే భూమిలో రూ. 70లక్షల నిధుల ద్వారా వెదురు బొంగు చెట్ల పెంచడం ద్వారా ఉపాధి కల్పిస్తామని వారికి హామీ ఇవ్వడంతో శుక్రవారం స్వచ్ఛందంగా వేసిన తాత్కాలిక గుడిసెలను తొలగించుకుంటామన్నారు. శుక్రవారం ఉదయం డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్, జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్, దండేపల్లి ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మరావు, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీంతో కొంత కాలంగా పోడు రగడ యుద్ధ వాతావరణం నేపథ్యంలో స్వయంగా గిరిజనులే అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవడంతో పోడు భూముల వివాదానికి తెరపడినట్లు అయింది.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

మంచిర్యాల క్రైం,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాలకు చెందిన నలిగేటి చందు, నలిగేటి రాజు, నరేష్, వంశీలపై దాడికి పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన రోహన్, అతనితో వచ్చిన దీపక్, సాయితేజ, లగిశెట్టి సాయికుమార్‌లను పాత మంచిర్యాలకు రమ్మని మాట్లాడుకుందామంటూ పిలిచారు.

పాత కక్షలను మనసులో పెట్టుకుని మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు రోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగాహారతి

బెల్లంపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామంలో గల బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం గంగాహారతి కార్యక్రమాన్ని అన్నదాన ట్రస్టు పర్సనల్ మాసాడి శ్రీదేవి శ్రీ రాములు ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య 12 నదుల నీటిని కలశంలో తీసుకొచ్చి కోనేటి వద్ద భక్తులు హారతిని నిర్వహించారు. భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



12నదుల నీటిని తీసుకొస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్



రోడ్లపై బ్లాక్ స్పాట్‌లు పరిశీలిస్తున్న మందమర్రి పోలీసులు

మందమర్రిటౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడుపడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరుగవని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ తెలిపారు. శుక్రవారం మందమర్రి సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారి శ్రీనివాస గార్డెన్ నుంచి బొక్కల గుట్ట ఎక్స్‌రోడ్డు వరకు బ్లాక్ స్పాట్లను ప్రత్యేకంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను నివారించేందుకు కొన్ని ప్రాంతాలను గుర్తించామని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. బొక్కలగుట్ట రోడ్డుపై వాహనాల వేగాన్ని తగ్గించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు కొన్ని స్పీడు బ్రేకర్లు వేయాలని సూచించామన్నారు. గడిచిన రెండు రోజుల్లోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. అంతే గాకుండా వాహనదారు లు హెల్మెట్‌లు తప్పకుండా ధరించాలని రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, ఆర్అండ్‌బీ డీఈతో పాటు ట్రాఫిక్ ఎస్ఐ, రామ కృష్ణాపూర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ

చెన్నూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శీతాకాల శిబిరంలో భాగంగా నాలుగో రోజు శుక్ర వారం అక్కెపల్లిలో మత్తు పదార్థాల నివారణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ దేవేందర్‌రావు హాజరై మాట్లాడారు. యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషా, హెచ్ఎం సుజాతరాణి, పంచాయతీ కార్యదర్శి సిరాజుద్దీన్, అధ్యాపకులు రామకృష్ణ, కృష్ణగోపాల్, శ్రీనివాస్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న కలెక్టర్

హాజీపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం పెద్దంపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాం గూడలో మండల ప్రభుత్వ ఉద్యోగులచే సేకరించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం చలి తీవ్రత మరింత అధికంగా ఉన్నందున చలి ప్రభావిత ప్రాంతాలలో ప్రజల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని, హాజీపూర్ మండలం ప్రభు త్వ ఉద్యోగులు దుప్పట్ల పంపిణీ చేపట్టడం అభినందనీయమని తెలిపారు. గ్రామంలోని 40 కుటుంబాల వారికి దుప్పట్లు అందజేశామని, చలి తీవ్రత అధికంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో పీవీటీజీలకు 200కు పైగా ఇళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇంటి స్థలం కలిగి ఉన్నవారికి ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక చేయూత అందిస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని, లబ్ధి దారులు వినియోగించుకోవాలని తెలిపారు. గిరిజన పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో అంతర్గత రహదారులు, తాగునీటి సమస్య లేకుండా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాజీపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :రాపల్లి 33/11 అలాగే గుడిపేట 33/11 కేవీ ఉపకేంద్రాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. మరమ్మతుల కారణంగా రాపల్లి, ధర్మారం, నర్సింగాపూర్, గుడిపేట్, నన్నూర్, చంద నాపూర్, ముల్కల్ల గ్రామాల పరిధిలోని వినియోగదారులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ శుక్రవారం విజ్ఞప్తి చేశారు.

సమయపాలన పాటించాలి

భీమిని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్, రికార్డులు, ల్యాబ్ రూమ్, ఫార్మసీ రూం, సిబ్బంది పని తీరును మండల వైద్యాధికారిని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనిల్ కుమార్, సీహెచ్‌ఓ పుట్ట సత్యం, సీహెచ్‌ఓ జలపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.